ప్రస్తుతానికి ఇరాన్‌పై దాడి లేదు: డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

2

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 27 మంగళవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 18 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

TUESDAY OCTOBER 27 2026 | VOL:1 | ISSUE: 18 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు.. రేవంత్ రెడ్డి స్పందన

- మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా
- రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు వినియోగించుకుంటున్న పథకం
- ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అన్న సీఎం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లే లబ్ధిదారులకు శుభవార్త.. త్వరలో ఫైనల్ బిల్లులు!

- ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ
- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి
- రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని

(మిగతా 2వ పేజీలో..)



ముంబైలో ఫడ్నవీస్‌తో రేవంత్ భేటీ.. తుమ్మిడిహెట్టిపై కీలక చర్చ

- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపుపై ప్రధానంగా చర్చ
- ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా ముంబైలో జరిగిన సమావేశం
- 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు ఎత్తు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా



(మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు: ఐదు నెలల తర్వాత నేపాలీ ముఠా అరెస్ట్

హైదరాబాద్ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తనుజా రంజన్ హత్య కేసులో ఐదు నెలల తర్వాత కీలక పురోగతి లభించింది. ఈ దారుణానికి సూత్రధారిగా వ్యవహరించిన ఇంట్లోని పనిమనిషి ధర్మ అలియాస్ కల్పన సహా నలుగురు నేపాలీ నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, భారత్–నేపాల్ సరిహద్దుల్లో

(మిగతా 2వ పేజీలో..)

ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు

- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
- అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం అని వ్యాఖ్య



ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు.హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.



హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ
- ఎస్ఐఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
- ఓటర్ల పేర్ల తొలగింపుపై రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత సవాల్

తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

(మిగతా 2వ పేజీలో..)



తెలంగాణలో వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్‌కు రూ. 5,000 దాటిన రేటు!

- తెలంగాణలో వడ్లకు రికార్డు స్థాయిలో ధరలు
- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాలు జై శ్రీరామ్ వడ్లు రూ. 5,016
- సాగు తగ్గడం, పారుగు రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడమే కారణం
- ప్రభుత్వ మద్దతు ధరను మించిపోవడంతో పౌరసరఫరాల శాఖకు సవాల్
- రిటైల్ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ. 100కు చేరిక

తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది.

(మిగతా 2వ పేజీలో..)

ఆ ఒక్క పని చేయండి.. 30 సెకన్లలో నిరసన ఆపేస్తాం: ఢిల్లీ వ్యాపారులతో రాహుల్ గాంధీ



- నవంబర్ 1న తలపెట్టిన నిరసనపై షరతు పెట్టిన రాహుల్ గాంధీ
- ఆందోళన వాయిదా వేయాలన్న వ్యాపారుల అభ్యర్థనకు తిరస్కరణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగిస్తే నిరసన ఆగిపోతుందన్న రాహుల్
- పండుగ వేళ ఆందోళనతో రూ.10,000 కోట్ల నష్టం వస్తుందని వ్యాపారులు
- ఎలక్టోరల్ రోల్స్ సవరణపై సీఈసీ రాజీనామాకు విపక్షాల డిమాండ్


ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తే, తాము తలపెట్టిన ఆందోళనను 30 సెకన్లలోనే విరమించుకుంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలో విపక్ష 'ఇండియా' కూటమి తలపెట్టిన భారీ నిరసనను వాయిదా వేయాలని వ్యాపారులు కోరిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.వివరాల్లోకి వెళితే, ఎలక్టోరల్ రోల్స్‌లో ప్రత్యేక సవరణలకు (ꟻ×=) సంబంధించి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు నవంబర్ 1న

(మిగతా 2వ పేజీలో..)

తీవ్ర తుపానుగా బలపడిన 'అర్ణబ్'.. ఏపీ తీరం వైపు వేగంగా కదలిక!

- ఎల్లుండి బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ వేగంతో గాలులు
- కోస్తాంధ్రలో రేపు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్ష సూచన

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ముంబైలో ఫడ్నవీస్‌తో రేవంత్ భేటీ.. తుమ్మిడిహెట్టిపై కీలక చర్చ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై నెలకొన్న అడ్డంకులు తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ముంబైలోని సహ్యాద్రి అతిథి గృహంలో ఈ ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును ప్రస్తుతం ఉన్న ఒప్పందం ప్రకారం 148 మీటర్లకే పరిమితం చేస్తే ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను, అదే ఎత్తును 152 మీటర్లకు పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలను ఫడ్నవీస్‌కు రేవంత్ రెడ్డి వివరించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు 2 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా సాగునీరు అందించవచ్చని, తద్వారా విద్యుత్ ఖర్చు గణనీయంగా తగ్గుతుందని ఆయన తెలిపారు.బ్యారేజీ ఎత్తు పెంచితే మహారాష్ట్రలో ముంపు ఏ మేరకు ఉంటుంది, నీటి నిల్వ సామర్థ్యం వంటి సాంకేతిక అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గత ఒప్పందాన్ని పునఃసమీక్షించి, బ్యారేజీ ఎత్తు పెంపునకు అంగీకరించాలని తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రను కోరింది.

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు: ఐదు నెలల తర్వాత నేపాలీ ముఠా అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఐదు నెలల పాటు గాలించి నిందితులను కదలికలను గుర్తించారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం మీడియా సమావేశంలో ఈ అరెస్టుల వివరాలను వెల్లడించారు. నిందితులైన ధర్మ అలియాస్ కల్పన (26), గణేశ్ బి.కె (31), చంద్ర బహదూర్ థమన్ (44), గణేశ్ బహదూర్ షాహి (37)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు.

పక్కా ప్రణాళికతో దోపిడీ, హత్య

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మే 7, 8 తేదీల మధ్య రాత్రి ప్రశాసన్ నగర్‌లోని తనూజ రంజన్ నివాసంలోకి చొరబడిన నిందితులు, ఆమెను కదలకుండా బంధించి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఇంట్లోని 225 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో పరారయ్యారు. ఈ కేసులో ఇంట్లో పనిచేసే ధర్మ తిరువా అలియాస్ కల్పన (26) కీలక పాత్ర పోషించింది. నేపాల్‌లోని సుర్ఖేత్ జిల్లాకు చెందిన కల్పన, జూన్ 2025లో బంధువుల ద్వారా హైదరాబాద్ వచ్చి, నెలకు రూ. 20,000 జీతానికి తనూజ ఇంట్లో పనికి కుదిరింది. పనిలో చేరినప్పటి నుంచి పుణెలో ఉంటున్న బికాస్ అనే నేపాల్ జాతీయుడితో ఆమె టచ్‌లో ఉంది. యజమానురాలి ఇంట్లో ఉన్న ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాల గురించి బికాస్ తరచూ అడిగి తెలుసుకునేవాడు. ఇంట్లో దోపిడీకి సహకరిస్తే వాటా ఇస్తానని ఆశ చూపడంతో కల్పన అంగీకరించింది.

నేరానికి ముందు ఏం జరిగింది?

ఏప్రిల్ 2026లో అనారోగ్యంతో ఉన్న తన తండ్రిని చూసేందుకు పుణే వెళ్లిన కల్పన, అక్కడ ఈ ముఠాలోని ఇతర సభ్యులను కలుసుకుంది. మే 4న యజమానురాలు తనూజ బెంగళూరు వెళ్తున్నట్లు తెలియగానే, కల్పన వెంటనే ముఠాకు సమాచారం ఇచ్చింది. దీంతో మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో గణేశ్ బహదూర్ షాహి, శంకర్ చంద్ర లామా, సునీల్ పరియార్ సమావేశమై, అద్దెకు తీసుకున్న మారుతి ఎర్టిగా కారులో పుణే చేరుకున్నారు. అక్కడ మరికొందరితో కలిసి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. మే 7న ఉదయం, గణేష్ బి.కె., సురేష్ షాహి అనే ఇద్దరు నిందితులు కల్పనను కలిసి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంట్లోకి ఎలా ప్రవేశించాలనే దానిపై చర్చించుకున్నారు. అదే రోజు సాయంత్రం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ సమీపంలోని రవీంద్ర బార్ వద్ద ముఠా సభ్యులందరూ సమావేశమై, సుజన్ షాహి అలియాస్ సురేష్ షాహి నేతృత్వంలో రెండు బృందాలుగా విడిపోయారు. గణేష్ బి.కె., సురేష్ షాహి, శంకర్ లామా దోపిడీ చేసేందుకు ఇంట్లోకి వెళ్లాలని, గణేష్ బహదూర్ షాహి, సునీల్ పరియార్, నేత్ర షాహి బయట నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద కాపలా కాయాలని నిర్ణయించుకున్నారు.

సుదీర్ఘ దర్యాప్తు, అరెస్టులు

ప్రణాళిక ప్రకారం, మే 7 రాత్రి కల్పన ఇంటి తలుపులు తీసి ముఠా సభ్యులను లోపలికి అనుమతించింది. ఆ సమయంలో శబ్దం విని మేల్కొన్న తనూజను నిందితులు బంధించి, ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం ఇంట్లోని బీరువాలు పగలగొట్టి బంగారం, విలువైన వస్తువులు తీసుకుని వెనుక గేటు నుంచి పారిపోయారు. నాంపల్లి వద్ద కాపలా ఉన్న బృందాన్ని కలుసుకుని, కాజీపేట వైపు పారిపోయారు. అక్కడ ఒక కొండ ప్రాంతానికి చేరుకుని, దోచుకున్న సొత్తును తొమ్మిది సమాన భాగాలుగా పంచుకుని, చిన్న చిన్న బృందాలుగా విడిపోయి నేపాల్‌కు పారిపోయారు.ఈ కేసుపై దృష్టి సారించిన సిట్, మే 22న సునీల్ బహదూర్, దొంగ సొత్తు కొనుగోలు చేసిన దిలీప్ బహదూర్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి 26 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకుంది. అనంతరం బెంగళూరు, ముంబై, పుణె, సూరత్, పాట్నా, ఢిల్లీ, లక్నో, ఉత్తరాఖండ్‌లలో ఐదు నెలలకు పైగా దర్యాప్తు చేపట్టింది. నేపాల్ సరిహద్దులోని మారుమూల ప్రాంతాల్లో స్థానిక సమాచారం సహాయంతో నిందితుల కదలికలను గుర్తించి, సోమవారం నాడు ప్రధాన నిందితులైన కల్పన, గణేశ్ బి.కె., చంద్ర బహదూర్ తమాంగ్, గణేశ్ బహదూర్ షాహిలను అరెస్ట్ చేసింది. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

తెలంగాణలో వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్‌కు రూ. 5,000 దాటిన రేటు!

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధరల పెరుగుదలకు కారణాలివే..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

ప్రభుత్వానికి సవాల్.. వినియోగదారులపై భారం

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (ప్రణా) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది.

రైతుల హర్షం.. ప్రభుత్వ స్పందన

"వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

ఇందిరమ్మ ఇళ్లే లబ్ధిదారులకు శుభవార్త.. త్వరలో ఫైనల్ బిల్లులు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు.మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.

ఆ ఒక్క పని చేయండి.. 30 సెకన్లలో నిరసన ఆపేస్తాం: ఢిల్లీ వ్యాపారులతో రాహుల్ గాంధీ

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. అయితే, నవంబర్ 8న దీపావళి, 6న ధన్‌తేరస్ ఉన్నందున, పండుగ సీజన్‌లో ఈ ఆందోళన నిర్వహిస్తే వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల దాదాపు రూ.10,000 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని, కాబట్టి నవంబర్ 10 తర్వాత నిరసన చేపట్టాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసింది.వ్యాపారుల అభ్యర్థనను రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. ఈ విషయంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వం మెట్రోను మూసివేసి, రోడ్లకు సీల్ వేసి, రాజధానిని లాక్‌డౌన్ చేసిందని, దొంగిలించబడిన ఓటుతో ఏదీ సురక్షితం కాదని విమర్శించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడుతూ, "నిందితుడు నంబర్ 4 అయిన జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించమని మోదీకి చెప్పండి. 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి" అని తేల్చిచెప్పారు. కేవలం ధన్‌తేరస్ రోజునే ఢిల్లీ మార్కెట్లలో సుమారు రూ.25,000 కోట్ల టర్నోవర్ జరుగుతుందని అంచనా. ఇంతటి కీలక సమయంలో ఆందోళన చేపట్టడంపై వ్యాపార వర్గాలు ఆందోళన చెందుతున్నప్పటికీ, సీఈసీ రాజీనామా విషయంలో వెనక్కి తగ్గేది లేదని విపక్షాలు స్పష్టం చేస్తున్నాయి.

తీవ్ర తుపానుగా బలపడిన 'అర్ణబ్'.. ఏపీ తీరం వైపు వేగంగా కదలిక!

ప్రజల కోసం విపత్తుల నిర్వహణ సంస్థ హెల్ప్‌లైన్ నంబర్లు జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను మరింత బలపడి తీవ్ర తుపానుగా మారింది. ఇది వేగంగా ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోందని, దీని ప్రభావం రాష్ట్రంపై గణనీయంగా ఉండనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ తుపాను రానున్న 12 గంటల్లో అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.ప్రస్తుతం తూర్పుమధ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ తుపాను, గడిచిన 6 గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా పయనిస్తోంది. ఇది విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు చెరో 490 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 560 కి.మీ, మచిలీపట్నంకు 660 కి.మీ, బాపట్లకు 730 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. రేపు సాయంత్రం వరకు పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించి, ఆ తర్వాత వాయువ్య దిశగా మలుపు తీసుకుంటుందని అంచనా వేశారు.

బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం

ఎల్లుండి (బుధవారం) ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఈ తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గాలి వేగం గంటకు 115-125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరే సూచనలు ఉన్నాయని హెచ్చరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు, ఎల్లుండి విస్తారంగా వర్షాలు, పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుపాను నేపథ్యంలో రేపు కోస్తా తీరం వెంబడి గంటకు 90-100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు చెట్లు, భారీ హోర్డింగులు, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉండరాదని సూచించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ 112, 1070, 1800 425 0101 టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసింది. ప్రజలు ఈ నంబర్లను సంప్రదించి సహాయం పొందవచ్చని, అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ప్రస్తుతానికి ఇరాన్‌పై దాడి లేదు: డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

అమెరికా-ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై తక్షణ సైనిక దాడుల విషయంలో తాత్కాలికంగా వెనక్కి తగ్గుతున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. అయితే, ఈ వివాదాన్ని దౌత్యపరమైన ఒప్పందం ద్వారా పరిష్కరించాలా? లేక సైనిక చర్యతో ముగింపు పలకాలా? అనే అంశంపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి కొంతమేర తొలగినప్పటికీ, అటు దౌత్యపరమైన, ఇటు సైనికపరమైన అవకాశాలు రెండూ అందుబాటులోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది.ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు నిలిచిపోయినప్పటికీ, ఖతార్, పాకిస్థాన్ వంటి దేశాల మధ్యవర్తిత్వంతో దౌత్యపరమైన సంప్రదింపులు సాగుతున్నట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, అమెరికా విధించిన షరతులను ఇరాన్ తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఖతార్, పాకిస్థాన్ ప్రతినిధులు ఇరాన్‌లో పర్యటిస్తున్నారు. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ప్రస్తుతం తీవ్ర ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా తన నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేస్తే, జలసంధిని తిరిగి తెరిచేందుకు తాము సిద్ధమని ఇరాన్ రాయబారి సంకేతాలు పంపినట్లు సమాచారం. అయితే, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు అనుబంధంగా ఉన్న మీడియా ఈ వార్తలను ఖండించింది. వెరసి, ఆ ప్రాంతంలో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

పోలీసుల సేవా స్ఫూర్తి.. 150 మందికి పైగా రక్తదానం





- **పోలీసు అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి**
- **రక్తదానం ప్రాణదానంతో సమానం: ఎస్పీ నరసింహ ఐపీఎస్**

సూర్యాపేట, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా తొలుత రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ ప్రతినిధులు, యువత, స్థానిక పౌరులు ఉత్సాహంగా పాల్గొని 150 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో కీలకమని పేర్కొన్నారు. సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందనే సందేశాన్ని అందించామన్నారు.ఖమ్మంకు చెందిన తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉపయోగపడేలా స్వచ్ఛంద రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. యువత పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు.పోలీసుల త్యాగాలు, బలిదానాలను ప్రజలు గుర్తించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు ప్రజలు సహకరించి భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాసేవలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, సీఐలు రాజశేఖర, నాగేశ్వరరావు, వెంకటయ్య, రామారావు, శివకుమార్, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, సంఘం సభ్యులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, స్థానిక పౌరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల స్మారకార్థం రేపు సూర్యాపేటలో భారీ బైక్ ర్యాలీ

- **ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభం**
- **యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: ఎస్పీ నరసింహ ఐపీఎస్**

సూర్యాపేట, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):



పోలీసు అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం (అక్టోబర్ 27) ఉదయం 10 గంటలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల రక్షణ కోసం తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల స్మారకార్థం ఈ ర్యాలీని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ

జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) వద్ద ప్రారంభమయ్యే బైక్ ర్యాలీ కోర్టు చౌరస్తా, పీఎస్ఆర్ సెంటర్, రాఘవ ప్లాజా, శంకర్ విలాస్ సెంటర్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు కొనసాగుతుందని ఎస్పీ వివరించారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

సమాజ శ్రేయస్సు, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్పీ అన్నారు. పోలీసు అమరవీరులకు ఘన నివాళులు అర్పించే ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నీరు, విద్యుత్ వృథాను అరికట్టాలి

- **గరిడేపల్లిలో మిషన్ భగీరథ లీకేజీలు, పగటిపూట వీధి దీపాలపై వీ=ూా ఫిర్యాదు**
- **అంబేద్కర్ నగర్ పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతి**

గరిడేపల్లి, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామంలో నీరు, విద్యుత్ వృథాను అరికట్టడంతో పాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ గరిడేపల్లి మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గరిడేపల్లి యూత్ ఆధ్వర్యంలో ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో నీటి సంక్షోభం ఏర్పడే పరిస్థితుల నేపథ్యంలో నీటిని, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపుల లీకేజీలను అరికట్టి, విరిగిన కుళాయిలను మరమ్మతు చేయాలని కోరారు. ఇళ్ల వద్ద వృథాగా నీరు పారకుండా పైపులకు మూతలు బిగించాలని, ట్యాంకులు నిండిన వెంటనే మోటార్లు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. వాహనాలు, రోడ్లను అవసరానికి మించి నీటితో కడుగుతూ విలువైన నీటిని వృథా చేయవద్దని ప్రజలకు సూచించారు.మరోవైపు, పగటిపూట కూడా గ్రామంలోని బజార్లు, వీధుల్లో లైట్లు వెలుగుతూ విద్యుత్ వృథా అవుతోందని, సంబంధిత అధికారులు స్పందించి పగటిపూట వీధి దీపాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మండలంలోని 33 గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులతో ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి నీటి పొదుపుపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనలపై జరిమానాలు విధించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.





విద్యార్థులకు తాగునీటి కష్టాలు..


గరిడేపల్లి అంబేద్కర్ నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న 50 నుంచి 60 మంది విద్యార్థులు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిధులతో లేదా దాతల సహకారంతో తక్షణమే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.సంబంధిత అధికారులు ఈ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జై భీమ్ షెడ్యూల్డ్ కాస్ట్ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రవి, ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి ఆలంపల్లి శేఖర్, పిట్ట నాగార్జున, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు బుడిగ చక్రవర్తి, మచ్చ వేణు, వట్టెపు మధు, కొత్తపల్లి పవన్, మచ్చ ఆదాం, బచ్చలకూరి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

అభ్యంతరాలుంటే ఈ నెల 28లోగా తెలియజేయాలి

ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థులకు సూచన

సూర్యాపేట, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):



ప్రెస్ నోట్

తేదీ: 26.10.2026

జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 28 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (MLHP) పోస్టుల కాంట్రాక్టు నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎవరికైనా ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌పై అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 28వ తేదీ (అక్టోబర్ 28)లోపు తమ అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు. అభ్యంతరాలను అక్టోబర్ 28న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అన్ని పని దినాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, డీఎంహెచ్ఓ కార్యాలయం, సూర్యాపేటలో సమర్పించాలని ప్రకటనలో పేర్కొన్నారు.అభ్యర్థులు నిర్దిష్ట గడువులోగా తమ అభ్యంతరాలను సంబంధిత కార్యాలయంలో తెలియజేసి, నియామక ప్రక్రియలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.

జోడేఘాట్‌లో కుమురం భీంకు ఘన నివాళులు


- **ఆదివాసీల హక్కుల సాధనకు నిరంతర పోరాటం**
- **పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి.. ఆదివాసీ ప్రాంతాలను అభివృద్ధి చేయాలి**

జోడేఘాట్, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

ఆదివాసీల ఆస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసం 'జల్, జంగల్, జమీన్' నినాదంతో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన ఆదివాసీ పోరాట యోధుడు అమరవీరుడు కుమురం భీం 86వ వర్ధంతి సందర్భంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆదివాసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మాడవి మధు తదితరులు కుమురం భీం త్యాగాలను స్మరించుకున్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం ప్రతిపత్తి కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు.

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి మంత్రులకు వినతి

కుమురం భీంకు నివాళులర్పించిన అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మంత్రులను ఆదివాసీ నాయకులు కలిసి, ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా అందజేశారు. మారుమూల ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి, ఆయా ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా బీఏఎస్ పాఠశాలల్లో చదువుతున్న ఆదివాసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రులను కోరారు.ఆదివాసీల హక్కుల సాధన, విద్యార్థుల భవిష్యత్తు, మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పోరాటం కొనసాగిస్తామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



పాల్గొన్న నాయకులు

ఈ కార్యక్రమంలో సుంగాపూర్ సర్పంచ్ పెందోర్ లక్ష్మణ్, చోర్గావ్ సర్పంచ్ కుమ్రం ధర్ము, లోకారి బి సర్పంచ్ మాడవి తనజీ, తుడుందెబ్బ గదిగూడ మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ మధు, నార్నూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెస్రం మోతిరం, ఆదివాసీ విద్యార్థి సంఘం గదిగూడ మండల అధ్యక్షుడు మరప గంగారాం, నార్నూర్ మండల గౌరవ అధ్యక్షుడు పెందోర్ క్రిష్ణ, తుడుందెబ్బ ఉట్నూర్ ఉపాధ్యక్షుడు సోయం దేవరావు, ప్రచార కార్యదర్శి మెస్రం సంతోష్, ఏఎస్‌యూ నాయకులు ఆత్రం విజయ్, మెస్రం సంతోష్, తుడుందెబ్బ నాయకులు మడావి సీతారాం, పెందోర్ చంద్రహరి, పెందోర్ క్రిష్ణ, పెందోర్ సతీష్ తదితర ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

నల్లగొండలో అఖిల భారత 36వ రైతు మహాసభలను జయప్రదం చేయండి

- **రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలి**
- **రైతు మహాసభలకు విరివిగా విరాళాలు అందించి సహకరించండి: సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్**

గరిడేపల్లి, ప్రజానేస్తం జ్వాల:

వీర తెలంగాణ పోరాటాల పురిటిగడ్డ నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత 36వ రైతు మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం గరిడేపల్లి మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ పిలుపునిచ్చారు. గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలోని సుందరి భిక్షమయ్య భవనంలో బి. అర్జున్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు దేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, వ్యవసాయ రంగ ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) నిరంతరం పోరాటాలు సాగిస్తోందన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రాత్మక రైతాంగ పోరాటంలో ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. రైతు ఉద్యమాన్ని విరమించే సమయంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఐక్య పోరాటాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ, వ్యవసాయ రంగంలో కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతులను సమీకరించి ఉద్యమాలు చేపడుతున్నామని అన్నారు. తెలంగాణలో బీడు భూములకు సాగునీరు అందించే ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కౌలు రైతులకు న్యాయం చేయాలని, రైతులకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు.రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లగొండలో జరిగే అఖిల భారత 36వ రైతు మహాసభల విజయవంతానికి ప్రజలు, రైతులు విరివిగా విరాళాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు తుమ్మల సైదయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి ఎనాల సోమయ్య, అధ్యక్షుడు రాయిరాల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సుశీల, జుట్టుకొండ కలమ్మ, దోసపాటి భిక్షం, అంబటి భిక్షం, దోసపాటి సుధాకర్, మండవ సైదులు, గుండెబోయిన సముద్రం, రాము తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పార్టీ బలోపేతానికి శ్రీలతా రెడ్డి సేవలు అభినందనీయం: మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గరిడేపల్లి, ప్రజానేస్తం జ్వాల:

గరిడేపల్లి మండల కేంద్రంలో బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చల్లా శ్రీలతా రెడ్డి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి ఆమె అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.జన్మదిన వేడుకల సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. పార్టీ ఐక్యత, బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సోమయ్య గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపాటి రాజు, సీనియర్ నాయకుడు రావుల ఆంజనేయులు గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నర్సింగ్ నాగ సైదులు, యువమోర్చా మండల అధ్యక్షుడు తెల్లగొర్ల వీరబాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మాలోత్ నరసింహ నాయక్‌తో పాటు వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో 13 మందికి పదోన్నతులు

- **లీడింగ్ హ్యాండ్స్‌గా బాధ్యతలు.. ఉద్యోగులకు అధికారుల అభినందనలు**

హనుమకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) వరంగల్ రీజియన్ పరిధిలో 13 మంది ఉద్యోగులకు లీడింగ్ హ్యాండ్ (LH)లుగా పదోన్నతులు లభించాయి. పదోన్నతులు పొందిన వారిలో 8 మంది మెకానిక్‌లు, ఐదుగురు ఆర్టిజన్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా రీజియన్ కార్యాలయంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భవాని ప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కిషన్‌రావు, పర్సనల్ ఆఫీసర్ వీరన్న పదోన్నతి పొందిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పదోన్నతితో ఉద్యోగులపై బాధ్యతలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సాంకేతిక మరమ్మతులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేస్తూ ప్రయాణికులకు సురక్షితమైన, మెరుగైన సేవలు అందించే దిశగా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఉద్యోగుల కృషి, సాంకేతిక నైపుణ్యానికి గుర్తింపుగా లభించిన ఈ పదోన్నతులు మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

జీడబ్ల్యూఎంసీ ప్రజావాణికి 113 అర్జీలు

- **ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు.. గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలి: కమిషనర్ తి. వెంకన్న**

హనుమకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):




గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 113 అర్జీలు అందినట్లు నగర కార్పొరేషన్ కమిషనర్ తి. వెంకన్న వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు.శాఖల వారీగా అందిన అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగానికి అత్యధికంగా 48, టౌన్ ప్లానింగ్ విభాగానికి 39, ప్రజారోగ్యం--పారిశుద్ధ్య విభాగానికి 15, రెవెన్యూ విభాగానికి 10, హార్టికల్చర్ విభాగానికి ఒక అర్జీ అందినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ తి. వెంకన్న మాట్లాడుతూ ప్రజలు అందించిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, నిర్దేశిత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని స్పష్టం చేశారు. ప్రజావాణి అర్జీలను బాధ్యతగా స్వీకరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

- **విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం**

హనుమకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో టీజీ ఎన్పీడీసీఎల్ (ఏ+వీూణజూ) యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.విద్యుత్ సరఫరాకు ఆటంకాలు కలగకుండా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అవసరమైన పరికరాలు, మరమ్మతు సామగ్రితో సిద్ధంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ లైన్లకు నష్టం వాటిల్లినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి విద్యుత్ సమస్యలు, సరఫరా అంతరాయాలు, ఇతర ఫిర్యాదుల కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని అధికారులు సూచించారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

- **ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ అభివృద్ధి పథంలో సాగాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

హనుమకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

రామాయణ మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం, సందేశాలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు.సోమవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ధర్మం, నీతి, మానవీయ విలువలకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆయన జీవితం, బోధనలు సమాజానికి మార్గదర్శకమని అన్నారు. వాల్మీకి మహర్షి చూపిన ధర్మమార్గాన్ని అనుసరిస్తూ, భారతీయ సంస్కృతి, ఉన్నత సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యతతో, పరస్పర గౌరవంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లపై పంచాయతీ రగడ!

- **సర్పంచ్ సతీమణికి ఇల్లు కేటాయింపుపై గ్రామస్థుల అభ్యంతరం**
- **ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ముగ్గురు వార్డు సభ్యులు**
- **అర్హులైన నిరుపేదలకే ఇళ్లు దక్కేలా చూస్తాం: అధికారుల హామీ**

నేరేడుచెర్ల, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం లాల్ లక్ష్మీపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక వివాదానికి దారితీసింది. గ్రామ సర్పంచ్ సతీమణికి ఇల్లు కేటాయించడంపై గ్రామస్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ముగ్గురు వార్డు సభ్యులు ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

లబ్ధిదారుల ఎంపికపై అభ్యంతరాలు!


నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. అయితే లాల్ లక్ష్మీపురంలో లబ్ధిదారుల ఎంపికపై వివాదం తలెత్తింది. సర్పంచ్ సతీమణికి ఇల్లు కేటాయించిన అంశంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలు ఉండగా, లబ్ధిదారుల ఎంపిక ఏ ప్రాతిపదికన జరిగిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అర్హతల పరిశీలన, ఎంపిక ప్రక్రియ పారదర్శకతపై గ్రామస్థులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు.. విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై ముగ్గురు వార్డు సభ్యులు ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్షేత్రస్థాయి విచారణకు అధికారుల హామీ

వివాదంపై స్పందించిన అధికారులు మరోసారి గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ నిర్వహిస్తామని తెలిపినట్లు సమాచారం. ఫీల్డ్ ఆఫీసర్ గ్రామానికి వచ్చి పరిస్థితులను



పరిశీలిస్తారని, అర్హులైన నిరుపేదలకే ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

విచారణతో తేలనున్న వాస్తవాలు

సర్పంచ్ సతీమణి ఇల్లు పొందేందుకు నిర్దేశిత అర్హతలు కలిగి ఉన్నారా? లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వ నిబంధనలు పాటించారా? గ్రామంలోని అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగిందా? అన్న అంశాలపై అధికారుల విచారణతో స్పష్టత రావాల్సి ఉంది.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు అందాలంటే ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారుల క్షేత్రస్థాయి విచారణ అనంతరం తీసుకునే నిర్ణయంపై గ్రామంలో ఆసక్తి నెలకొంది.

జ్ఞానమే జీవితాల్లో మార్పునకు బాట.. మానవత్వమే సమాజానికి బలం!





- **మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
- **కరుణ, దయ, మంచి గుణాలతోనే సమాజాభివృద్ధి**

సూర్యాపేట, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

జ్ఞానమే మనిషి జీవితంలో ఉన్నతమైన మార్పునకు పునాది అని, మంచి ఆలోచనలు, ఉన్నతమైన విలువలతోనే సమాజంలో సానుకూల పరివర్తన సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన బోధనలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సోమవారం సూర్యాపేట జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సాధారణ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగడంలో జ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని, జ్ఞానాన్ని సంపాదించడంతో పాటు దానిని ఆచరణలో పెట్టినప్పుడే వ్యక్తిగత జీవితంలోనూ, సమాజంలోనూ నిజమైన మార్పు వస్తుందని తెలిపారు. మనిషిలో మార్పు ప్రారంభమైతే సమాజంలోనూ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ప్రతి జీవిపై దయ.. అదే నిజమైన మానవత్వం

మహర్షి వాల్మీకి జీవితం నుంచి కరుణ, దయ, మానవత్వం వంటి గొప్ప విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకు సైతం ఈ ప్రపంచంలో జీవించే హక్కు ఉందని, ప్రతి జీవిని ప్రేమతో, కరుణతో చూడాలని పిలుపునిచ్చారు. ఇతరుల పట్ల దయ, బాధ్యతతో వ్యవహరించినప్పుడే మానవత్వానికి నిజమైన అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు.వేల సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చిన రామాయణం నేటికీ ప్రజలకు జీవన మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం మారుతున్నప్పటికీ మానవీయ విలువలు ఎప్పటికీ శాశ్వతమని వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటిలోని ఉత్తమ విలువలను భావితరాలకు అందించాలని సూచించారు.

మంచి గుణాలే అభివృద్ధికి మార్గం

ప్రతి ఒక్కరూ తమలోని చెడు లక్షణాలను విడనాడుతూ మంచి గుణాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. వ్యక్తిగత మార్పు, సామాజిక బాధ్యత, నైతిక విలువలు బలపడినప్పుడే జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెండెం వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొప్పూర్ గ్రామంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

- **కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో శుద్ధ తాగునీటి సౌకర్యం**
- **గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం**

ముల్కనూరు, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామీణ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో హనుమకొండ జిల్లా పరిధిలోని కొప్పూర్ గ్రామంలో ఆర్వో (=ా) ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. ముల్కనూరు సహకార సంఘం ఆధ్వర్యంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ కొప్పూర్ గ్రామాన్ని దత్తత తీసుకున్న నేపథ్యంలో, సంస్థ సౌజన్యంతో గ్రోమోర్ గ్రామం కొప్పూర్‌లో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.ఈ ఆర్వో ప్లాంట్‌ను ముల్కనూరు సహకార సంఘం అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ ఎన్. హరి, సీనియర్ అగ్రానమిస్ట్ వినోద్, కొప్పూర్ గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి సంయుక్తంగా ప్రారంభించారు.

గ్రామస్థులకు శుద్ధ తాగునీటి భరోసా

గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని తెలిపారు.ఆర్వో ప్లాంట్ అందుబాటులోకి రావడంతో గ్రామస్థులకు తాగునీటి అవసరాల విషయంలో ప్రయోజనం చేకూరనుంది. ప్రజారోగ్య పరిరక్షణకు తాగునీటి నాణ్యత ఎంతో ముఖ్యమని, ప్లాంట్ నిర్వహణతో పాటు నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం అవసరమని పేర్కొన్నారు.

పలువురు ప్రముఖుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో ముల్కనూరు సహకార సంఘం డైరెక్టర్ మండ శ్రీనివాస్, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధులు శివశంకర్ రెడ్డి, హరిబాబు, కొప్పూర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



దీపావళి బాణాసంచా దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

- **తాత్కాలిక విక్రయ కేంద్రాల అనుమతులకు నవంబర్ 2 చివరి గడువు**
- **అనుమతులు లేకుండా దుకాణాలు తెరిస్తే కఠిన చర్యలు: సీపీ ఎన్. శ్వేత ఐపీఎస్**

హనుమకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



దీపావళి పండుగ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు కోరే వ్యాపారులు నవంబర్ 2వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ సూచించారు. నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు ఇవే..

బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు కోరే వ్యాపారులు ఫైర్ సర్వీస్ ఎన్ఓసీ (ఛీూజ), జీఎస్టీ సర్టిఫికెట్‌తో పాటు నిర్దేశిత రూ.800 ప్రభుత్వ చలాన్ సమర్పించాలని సీపీ తెలిపారు. సంబంధిత నిబంధనలను పాటిస్తూ అనుమతుల ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందకుండా తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పండుగ వేళ ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, ప్రమాదాలకు తావులేకుండా వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయాలు నిర్వహించాలనుకునే వ్యాపారులు నవంబర్ 2లోగా దరఖాస్తు చేసుకుని, అనుమతులు పొందిన తర్వాతే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

రేపటి నుంచే కేయూ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు.. ఏర్పాట్లు పూర్తి!

- **అక్టోబర్ 27 నుంచి 29 వరకు క్రీడా సంబరాలు.. 28న క్రాస్ కంట్రీ రేసు**

హనుమకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు (2026--27, ఫేజ్-2) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అక్టోబర్ 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి.ఈ పోటీల్లో పాల్గొనే వివిధ కళాశాలల క్రీడా జట్లు లిఅక్టోబర్ 27న ఉదయం 8 గంటలలోపులి మైదానంలో రిపోర్ట్ చేయాలని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో కోరారు.అలాగే అక్టోబర్ 28న ఉదయం 6 గంటలకు ఉత్సాహభరితంగా లిక్రాస్ కంట్రీ రేసులి నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు నిర్ణీత సమయానికి చేరుకుని పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించేలా ఈ పోటీలు సాగనున్నాయి.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి!

- ఎల్‌నినో ప్రభావం.. భూగర్భ జలాలపై ఆందోళన
- నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి.. రైతులకు 'ఖేత్ బచావో అభియాన్'లో అవగాహన

భీమదేవరపల్లి, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

యాసంగి సాగులో నీటి పొదుపునకు ప్రాధాన్యతనిస్తూ రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని అవగాహన కార్యక్రమంలో సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, భూగర్భ జలాల లభ్యతలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.గ్రామపంచాయతీ పరిధిలో కేంద్ర ప్రభుత్వ 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. యాసంగి సీజన్‌లో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉండటంతో పాటు, విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ఒత్తిడి పెరిగే పరిస్థితులను వివరించారు. ఈ నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉండే వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు.

నీటిని పొదుపు చేస్తేనే సాగుకు భరోసా

అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి రైతు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు అవకాశాలను పరిశీలించాలని, ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

పంటల మార్పిడితో వనరుల పరిరక్షణ



వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు, విద్యుత్ వినియోగంపై ఒత్తిడిని కూడా కొంతమేర తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు. అయితే, ఏ పంట సాగు చేయాలన్న నిర్ణయాన్ని మార్కెట్ డిమాండ్, పెట్టుబడి, నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి తీసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ, నీటి వనరులను సంరక్షించుకోవాలని, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని అవగాహన కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సాంకేతిక చిక్కులు.. బీసీ విద్యార్థులకు తప్పని తిప్పలు!

- ఆధార్--ఎస్సెస్సీ వివరాల మిస్‌మ్యాచ్‌తో నిలిచిపోతున్న దరఖాస్తులు
- 15 రోజులు పడుతుందంటున్న అధికారులు.. మరోవైపు సమీపిస్తున్న గడువు!
- గడువు పొడిగించాలని, సాంకేతిక సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని విద్యార్థుల డిమాండ్

వరంగల్ జిల్లా | ప్రజానేస్తం జ్వాల:

ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల ప్రక్రియ తలనొప్పిగా మారింది. చదువుకు ఆర్థిక భరోసాగా నిలవాల్సిన పథకానికి సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆధార్ కార్డు, పదో తరగతి (ఎస్సెస్సీ) ధ్రువపత్రాల్లోని వివరాలు సరిపోవడం లేదంటూ ఆన్‌లైన్ పోర్టల్‌లో 'డీటెయిల్స్ మిస్‌మ్యాచ్' ఎర్రర్ రావడంతో దరఖాస్తులు ముందుకు సాగడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పేరు, ఇంటిపేరు, పుట్టిన తేదీ, అక్షరాల క్రమం, స్పేసింగ్‌లో స్వల్ప తేడాలున్నా దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోతోందని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆధార్, ఎస్సెస్సీ పత్రాల్లో వివరాలు ఒకే విధంగా ఉన్నప్పటికీ మిస్‌మ్యాచ్ సందేశాలు వస్తుండటంతో అసలు సమస్య ఏమిటో తెలియక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

గడువు దగ్గరపడుతోంది.. పరిష్కారం ఎప్పుడో?

ఈ నెల 28వ తేదీని తొలి విడత దరఖాస్తులకు చివరి గడువుగా నిర్ణయించినట్లు సమాచారం. అయితే, వివరాల సవరణ, డేటా అప్‌డేట్‌కు కనీసం 15 రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. దీంతో గడువులోగా దరఖాస్తులు పూర్తవుతాయా? లేదా? అన్న సందిగ్ధత నెలకొంది.ఒకవైపు దరఖాస్తు చేసుకోవాలనే ఆత్రుత.. మరోవైపు సాంకేతిక సమస్యలతో ఎదురవుతున్న జాప్యం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. గడువులోగా దరఖాస్తు చేయలేకపోతే తొలి విడతలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలు అందుతాయో లేదోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కళాశాలల ఫీజుల చెల్లింపుల విషయంలోనూ ఒత్తిడి ఎదురవుతుందనే భయం వెంటాడుతోంది.కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించలేకపోతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్య పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ సమస్య వెంటనే పరిష్కారం కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు.ఆధార్ వివరాలను సవరించినా, కొత్త సమాచారం సంబంధిత పోర్టల్‌లో ప్రతిబింబించడానికి సమయం పడుతుండటంతో విద్యార్థులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్రెష్, రెన్యువల్ దరఖాస్తుదారులకూ సమస్యలు ఎదురవుతున్నట్లు సమాచారం.

14 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం!

రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ తదితర కోర్సుల్లో చదువుతున్న సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నట్లు సమాచారం. వీరి కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.2,250 కోట్లను వెచ్చిస్తున్నట్లు పేర్కొంటున్నారు.ఇప్పటివరకు సుమారు 9 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, మరో 5 లక్షల మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని సమాచారం. అయితే, ఈ గణాంకాలకు అధికారిక ధ్రువీకరణ అవసరం ఉంది.

'అప్లికేషన్ సబ్మిట్ కావడం లేదు'

ఓ బీటెక్ విద్యార్థి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ.. "ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేస్తుంటే ఆధార్, ఎస్సెస్సీ వివరాలు మిస్‌మ్యాచ్ అంటూ ఎర్రర్ వస్తోంది. రెండు సర్టిఫికెట్లలోనూ వివరాలు ఒకే విధంగా ఉన్నప్పటికీ సమస్య ఎదురవుతోంది. ఈ నెల 28 చివరి గడువు కావడంతో ఆందోళనగా ఉంది. అధికారులను సంప్రదిస్తే 15 రోజులు వేచి చూడాలని చెబుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలి" అని కోరారు.

సాంకేతిక సమస్యల పరిష్కార బాధ్యత ఎవరిది?

దరఖాస్తుల సమయంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను బీసీ సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సర్వర్, డేటా సంబంధిత సమస్యలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) పరిష్కరించాల్సి ఉందని చెబుతున్నట్లు విద్యార్థి ప్రతినిధులు పేర్కొంటున్నారు.కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలోనూ ఎర్రర్ సందేశాలు వస్తున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.విద్యార్థుల డిమాండ్లు ఇవే!ఆధార్, ఎస్సెస్సీ మిస్‌మ్యాచ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.దరఖాస్తుల గడువును మరో నెలపాటు పొడిగించాలి.సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలి.సాంకేతిక కారణాలతో ఆలస్యమైన విద్యార్థులకు నిబంధనల ప్రకారం అవకాశం కల్పించాలి.ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులకు స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించాలి.చదువుకు ఆర్థిక అండగా నిలవాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం.. సాంకేతిక సమస్యల కారణంగా విద్యార్థులకు భారంగా మారకూడదు. గడువు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం తక్షణమే స్పందించి, అర్హులైన విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

మఠంపల్లి ప్రజావాణికి అధికారుల గైర్హాజరు!


- సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలకు తప్పని ఎదురుచూపులు.. సమయపాలన ఏదీ?
- అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజల డిమాండ్

మఠంపల్లి, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడం ప్రజలను నిరాశకు గురిచేసింది. తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు, సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.మఠంపల్లి మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 11:15 గంటలు దాటినా సూపరింటెండెంట్ విజయలక్ష్మి మాత్రమే హాజరైనట్లు స్థానికులు పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు అప్పటివరకు హాజరుకాకపోవడంతో ఫిర్యాదులు అందజేసేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

సమస్యలు చెప్పుకునేదెవరికి?

మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమస్యలపై వినతులు సమర్పించేందుకు ప్రజావాణికి వస్తుంటారు. అయితే, సంబంధిత శాఖల అధికారులు సమయానికి అందుబాటులో లేకపోతే తమ సమస్యలను ఎవరికి వివరించాలి? పరిష్కారం కోసం మళ్లీ ఎన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరగాలి? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రజావాణి కార్యక్రమం కేవలం ఫిర్యాదులు స్వీకరించడానికే పరిమితం కాకుండా, సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి బాధ్యతాయుతంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి ప్రజావాణికి అధికారులు ఆలస్యంగా రావడం లేదా గైర్హాజరు కావడంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సమయపాలనపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం. ఆ లక్ష్యం నెరవేరాలంటే అధికారుల హాజరు, బాధ్యతాయుత స్పందన, సకాలంలో పరిష్కారం అత్యంత కీలకం.



రెండు రోజుల విరామం తర్వాత తెరుచుకున్న ఏనుమాముల మార్కెట్

- పత్తి ధర క్వింటాలుకు రూ.8,950.. వండర్ హాట్ మిర్చికి రూ.33 వేల ధర!

హనుమకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



రెండు రోజుల సెలవు విరామం అనంతరం వరంగల్‌లోని ప్రసిద్ధ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సోమవారం తిరిగి ప్రారంభమైంది. మార్కెట్ కార్యకలాపాలు పునఃప్రారంభం కావడంతో వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నమోదయ్యాయి. పత్తి ధర గత శుక్రవారంతో పోలిస్తే స్వల్పంగా తగ్గగా, మిర్చి రకాలు తమ ధరలను నిలబెట్టుకున్నాయి.మార్కెట్ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. క్వింటా పత్తి ధర రూ.8,950 పలికింది. గత శుక్రవారం పత్తి ధర రూ.9,010గా ఉండగా, తాజాగా రూ.60 తగ్గింది.ఇక మిర్చి ధరల విషయానికొస్తే.. తేజ రకం మిర్చి క్వింటాలుకు రూ.23,000, 341 రకం మిర్చి రూ.26,400, వండర్ హాట్ (డ్రై) మిర్చి రూ.33,000, టమాటా మిర్చి రూ.33,000 ధర పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.అలాగే మొక్కజొన్న క్వింటాలుకు రూ.3,030 ధర నమోదైంది.రెండు రోజుల విరామం తర్వాత మార్కెట్ తిరిగి ప్రారంభం కావడంతో రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు మార్కెట్‌కు తరలివచ్చారు. పంటలకు లభిస్తున్న ధరలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు రేపే!

- ఉదయం 10 గంటలకు ప్రారంభం.. పారదర్శకంగా కానుకల లెక్కింపు
- అధికారులు, సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు హాజరుకావాలని ఈఓ విజ్ఞప్తి

కొత్తకొండ, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు వెల్లడించారు.దేవస్థానానికి భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకల లెక్కింపును పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు సమయానికి హాజరుకావాలని ఈఓ కోరారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, వరంగల్ డివిజన్‌కు చెందిన సంబంధిత సిబ్బంది, ఆలయ అధికారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొననున్నారు. హుండీ లెక్కింపు సందర్భంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ, కానుకల లెక్కింపులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.లెక్కింపు ప్రక్రియకు సహకరించాలి హుండీ లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఏనుమాముల మార్కెట్‌కు 341 రకం మిర్చి రాక..

క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.19,011 ధర!

వరంగల్, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 341 రకం మిర్చి పంట తొలిసారిగా చేరింది. కొత్త పంట రాకతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా వ్యాపారులు కాంటాలకు పూజలు నిర్వహించి మిర్చి కొనుగోళ్లను ప్రారంభించారు.తొలిరోజు కొనుగోళ్లలో 341 రకం మిర్చికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.19,011 ధర పలికినట్లు సమాచారం. కొత్త పంట మార్కెట్‌కు చేరడంతో రైతులు, వ్యాపారుల్లో ఆసక్తి నెలకొంది. మిర్చికి ఆశాజనకమైన ధర లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో మార్కెట్‌కు పంట రాక పెరిగే అవకాశం ఉండటంతో ధరల సరళిపై రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఆపదలో అండగా నిలిచిన పెరిక కులస్తులు.. ఐక్యతకు నిదర్శనం!

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి రూ.1.25 లక్షల ఆర్థిక సాయం

సాయి కిరాణా దుకాణం పునరుద్ధరణకు చేయూత.. కులస్తుల సేవాభావం అభినందనీయం: అంగిరేకుల నాగార్జున

సూర్యాపేట, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

సమిష్టిగా ఉందాం.. ఆపదలో అండగా నిలుద్దాం.. అనే స్ఫూర్తితో పెరిక కులస్తులు మరోసారి ఐక్యతను చాటుకున్నారు. విజయదశమి పండుగ రోజున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కిరాణా దుకాణాన్ని కోల్పోయిన యర్రంశెట్టి ఉపేందర్ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు. సూర్యాపేట పట్టణ పెరిక సంఘం ఆధ్వర్యంలో కులస్తుల నుంచి సేకరించిన రూ.1.25 లక్షల చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా ఖైరతాబాద్ పెరిక హాస్టల్ మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ సూర్యాపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కులబంధువును ఆదుకునేందుకు కులస్తులంతా ఐక్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. విజయదశమి రోజున యర్రంశెట్టి ఉపేందర్‌కు చెందిన సాయి కిరాణా దుకాణం పూర్తిగా దగ్ధం కావడం బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తమకు తోచినంత సహాయం అందించేందుకు కులస్తులు ముందుకు రావడం వారి సేవాభావానికి నిదర్శనమన్నారు.కులస్తులంతా సమిష్టిగా ఉంటూ, ఎవరికి ఆపద వచ్చినా పరస్పరం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనుకోని విపత్తుతో ఇబ్బందుల్లో పడిన ఉపేందర్ కుటుంబం త్వరగా కోలుకోవాలని, తిరిగి తమ కిరాణా దుకాణాన్ని పునరుద్ధరించుకునేందుకు ఈ ఆర్థిక సాయం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పెరిక సంఘం అధ్యక్షులు పత్తిపాక వేణుధర్, గౌరవాధ్యక్షులు బంధు వీరయ్య, సహాధ్యక్షులు యర్రంశెట్టి రామలింగయ్య, ప్రధాన కార్యదర్శి పోతురాజు నరసయ్య, అంకతి వెంకన్న, పిన్నని మల్లికార్జున్, యాగ్గడి శ్రీనివాస్, పోకల రాజయ్య, పత్తిపాక రాధాకృష్ణ, తోగరు రామయ్య, కొనకంచి శ్రీనివాస్, నరెడ్ల నాగేశ్వర్ రావు, మేకల నగేష్, వడ్డే రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' చిత్రానికి సెన్సార్ పనులు పూర్తి

వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం'కు ఖ/ఊ సర్టిఫికెట్
అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల
తొలిసారి వెంకటేశ్ ను డైరెక్ట్ చేస్తున్న త్రివిక్రమ్
హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి, కీలక పాత్రలో నారా రోహిత్
ఫ్యామిలీ, యాక్షన్, కామెడీ అంశాలతో సినిమా నిర్మాణం



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - ఏకే 47'. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) ఖ/ఊ సర్టిఫికెట్ జారీ చేసింది. అక్టోబర్ 30న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ, "క్రైమ్, కామెడీ, యాక్షన్, ఫ్యామిలీ ఫన్ అన్నీ ఒకేచోట.. ఇది మిస్ చేయలేని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మొదట అక్టోబర్ 2న, ఆ తర్వాత అక్టోబర్ 9న విడుదల చేయాలని భావించినప్పటికీ, తాజాగా అక్టోబర్ 30 తేదీని ఖరారు చేశారు. వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వెంకటేష్ నటించిన బ్లాక్‌బస్టర్ 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రానికి త్రివిక్రమ్ రచయితగా పనిచేయడం విశేషం. ఆ సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. దీనికి తోడు, వెంకటేశ్ చివరి చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' కూడా భారీ విజయం సాధించడంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ చిత్రంలో వెంకటేష్‌కు జోడీగా 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి నటిస్తోంది. ఇటీవల ఆమె పాత్ర 'స్వర్ణ'ను పరిచయం చేస్తూ విడుదల చేసిన వీడియోకు మంచి స్పందన వచ్చింది. అందులో వెంకటేశ్ పాత్ర చిట్టిబాబు, "ఈ ఆడాళ్లకి ఆటిట్యూడ్ తప్ప గ్రాటిట్యూడ్ ఉండదు" అంటూ చెప్పే సంభాషణలు ఆకట్టుకున్నాయి. అలాగే, ఈ సినిమాలో యంగ్ హీరో నారా రోహిత్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పోస్టర్‌ను బట్టి పోలీస్ అధికారి పాత్రలో కనిపించవచ్చని ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద, ఎన్నో అంచనాల మధ్య ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.


పోలీసులను ఆశ్రయించిన విజయ్-రష్మిక టీమ్.. నెగటివ్ ప్రచారంపై ఫిర్యాదు

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నపై జరుగుతున్న దుష్ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు
'కాఫీ విత్ కరణ్' షోలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని ఆరోపణ
హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆధారాలు సమర్పించిన వారి టీమ్
బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుల హామీ
రష్మిక తన భార్య, స్నేహితురాలు అంటూ ఇటీవలే పోస్ట్ పెట్టిన విజయ్

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (విరోష్)పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై వారి టీమ్ తీవ్రంగా స్పందించింది. కొంతకాలంగా వీరిద్దరిపై కొందరు ఉద్దేశపూర్వకంగా నెగటివ్ ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపిస్తూ, హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు సోమవారం నాడు అధికారికంగా ఫిర్యాదు చేసింది. తమ హీరో, హీరోయిన్ల గౌరవాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని, చట్టపరంగా ఎంతవరకైనా వెళతామని వారి టీమ్ స్పష్టం చేసింది.

వివరాల్లోకి వెళితే...

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తరఫున వారి ప్రతినిధులు సైబర్ క్రైమ్ డీసీపీని కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో గతంలో విజయ్, రష్మిక చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి, తప్పుడు అర్థాలు వచ్చేలా కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఉద్దేశపూర్వక దుష్ప్రచారం తీవ్రమైన అసౌకర్యం, మానసిక వేదన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను, నిర్మాణాత్మక విమర్శలను తాము గౌరవిస్తామని, కానీ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించడాన్ని సహించబోమని విజయ్-రష్మిక టీమ్ స్పష్టం చేసింది. ఈ ఫేక్ ప్రచారానికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలు, స్క్రీన్‌షాట్‌లు, ఇతర కీలక ఆధారాలను పోలీసులకు సమర్పించింది. ఫిర్యాదును స్వీకరించిన సైబర్ క్రైమ్ అధికారులు, ఈ విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇటీవల విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియాలో రష్మికతో ఉన్న ఒక రొమాంటిక్ వీడియోను షేర్ చేస్తూ, ట్రోలింగ్‌కు గట్టి సమాధానం ఇచ్చారు. ఆ పోస్టులో రష్మికను తన "ఆత్మసఖి, భార్య, స్నేహితురాలు" అని అభివర్ణించారు. వాస్తవాలు తెలుసుకోకుండా తమ వ్యక్తిగత జీవితాలపై, కుటుంబ విషయాలపై వ్యాఖ్యలు చేయడం 'ఫెమినిజం' ముసుగులో వేధించడమేనని ఆయన మండిపడ్డారు.



ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి

- **ఎస్ఐఆర్ ప్రక్రియపై రోల్ అబ్జర్వర్ దేవసేన సమీక్ష**
- **పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.. అధికారులకు సూచనలు**

సూర్యాపేట, అక్టోబర్ 26 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--SIR) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని రోల్ అబ్జర్వర్ దేవసేన అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి ఆమె ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరు, ఓటర్ల నుంచి స్వీకరించిన ఫారాల పరిశీలన, ప్రాసెసింగ్, సంబంధిత రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), సంబంధిత ఓటరు నమోదు అధికారులు (ఈఆర్ఓలు) నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఫారాల పరిశీలనలో నిర్లక్ష్యం వద్దు

ఓటర్ల నుంచి స్వీకరించిన ప్రతి ఫారాన్ని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించాలని దేవసేన సూచించారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలు, సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు, సంబంధిత రికార్డులను జాగ్రత్తగా పరిశీలించి, వర్తించే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఫారాల పరిశీలన, ప్రాసెసింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి నిర్దేశిత విధానాల ప్రకారం పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఫారాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని రోల్ అబ్జర్వర్ ఆదేశించారు. దరఖాస్తుల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఓటర్ల వివరాల ధ్రువీకరణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను కచ్చితంగా అనుసరించాలని డీఈఓ, ఈఆర్ఓలకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, తహసీల్దార్లు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష తదితరులు పాల్గొన్నారు.



భోగి'లో అనుపమ డబ్బింగ్ అద్భుతం.. 1960ల యాసలో అదరగొట్టిందన్న సంపత్ నంది!

- **శర్వానంద్ హీరోగా పీరియడ్ యాక్షన్ డ్రామాగా 'భోగి'**
- **కందుల సులోచన రాణి పాత్రలో అనుపమ పరమేశ్వరన్**
- **'భోగి'లో అనుపమ డబ్బింగ్‌పై దర్శకుడు సంపత్ నంది ప్రశంసలు**
- **1960ల నాటి యాసను అద్భుతంగా పలికిందన్న దర్శకుడు**
- **నవంబర్ 12న పాన్-ఇండియా స్థాయిలో సినిమా విడుదల**

యంగ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'భోగి'. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న అనుపమ పరమేశ్వరన్‌పై దర్శకుడు సంపత్ నంది ప్రశంసల వర్షం కురిపించారు. సినిమాలోని తన పాత్రకు అనుపమ సొంతంగా డబ్బింగ్ చెప్పడమే కాకుండా, అత్యంత కష్టమైన యాసను కూడా అద్భుతంగా పలికిందని కొనియాడారు. సోమవారం, అనుపమ డబ్బింగ్ చెబుతున్న ఒక వీడియో క్లిప్‌ను సంపత్ నంది తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "1960ల నాటి గ్రామీణ యాసలో డబ్బింగ్ చెప్పడం అంత సులభం కాదు. కానీ, అనుపమ చాలా సునాయాసంగా చేసి చూపించింది. కందుల సులోచన రాణి అద్భుతం" అంటూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నవంబర్ 12న విడుదల చేయనున్నట్లు కూడా ఆయన స్పష్టం చేశారు. 'భోగి' చిత్రంలో అనుపమ 'కందుల సులోచన రాణి' అనే ఒక విభిన్నమైన పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఆమె క్యారెక్టర్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గ్రామీణ యువతిగా, కాళ్లకు చెప్పులు లేకుండా మట్టి దారిలో నడుస్తూ, తలపై మోదుగ ఆకులతో నిండిన బుట్టతో కనిపించిన ఆమె లుక్ పాత్రపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో ఆమె ప్రకృతితో మమేకమై జీవించే, మోదుగ ఆకులతో విస్తరాకులు కుట్టి జీవనం సాగించే మహిళగా కనిపించనుందని సమాచారం. 1960ల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ కల్పిత గ్రామంలో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా 'భోగి' రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో శర్వానంద్ 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, డింపుల్ హయతి మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైనర్‌గా, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రాఫర్‌గా, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నవంబర్ 12న పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.